సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 27 । జూన్ । 2025



మదనపల్లెలో కాల్ మనీ కీచకులు

ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలాంటి వ్యవహారమే మదనపల్లెలో జరుగుతుండటం చర్చనీయాంశమైంది. -8లో



బైకులు ఢీకొని యువకుడి దుర్మరణం

బైకులు ఎదురెదురుగా ఢీకొని హరీష్ అనే యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1406 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	475	580
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 83.060 కిలోలు

న్యూస్‌రీల్

'వందేభారత్' ట్రయల్ రన్ విజయవంతం

కడప కోటిరెడ్డిసర్కిల్: దేశంలో అధిక వేగంతో నడుస్తున్న రైళ్లలో ఒకటైన వందే భారత్ రైలు గురువారం కడప- రేణిగుంట మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. కాచిగూడ-చెన్నై మార్గంలో వందేభారత్ రైలు నడిపేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు సమాచారం. కాగా 130 కి.మీ. స్పీడ్‌తో రైలు నడిచినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని రైల్వే అధికారులు గుర్తించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో త్వరలోనే ఈ మార్గంలో వందేభారత్ రైలు నడిచే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

220 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌కు 86001వ ర్యాంకు నుంచి 104000 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 220 మంది అభ్యర్థులు తమ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసుకుని ధ్రువ పత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఎస్ ఆర్ లక్ష్మి ప్రసాద్, వెరిఫికేషన్ ఆఫీసర్లు వసుంధర, మల్లేశ్వరమ్మ, లావణ్య, రాజేష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

నేడు నిర్వహించబోయే కౌన్సిలింగ్‌కి జిల్లావ్యాప్తంగా 104001 నుంచి 120000 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు రావాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి



పశువులకు నట్టల నివారణ మందు అందజేస్తున్న పశువైద్యాధికారులు

సుండుపల్లి: గొర్రెలు, మేకల పెంపకం దారులు తమ జీవాలకు నట్టల నివారణ మందును తప్పకుండా వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. గురువారం సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లెలో గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందులను వేసినట్లు ఆయన తెలిపారు. జులై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని మేకలు, గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మూగజీవాలకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పశువైద్యాధికారులు సూచనలు పాటించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, సంబేపల్లి పశువైద్యాధికారి లోకేష్, ఏడీ వెంకటేశ్వరరెడ్డి, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

అడిగేదెవరు..అడ్డు చెప్పేదెవరు

- కుప్పం ఉప కాలువ లైనింగ్ పనుల్లో అంతా మా ఇష్టం
- ఇద్దరికి మాత్రమే పనుల బాధ్యతలు
- ఇద్దరితో నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ, రికార్డుల నమోదు సాధ్యమా!
- ఏరికోరి వారినే నియమించిన ఉన్నతాధికారులు..
- వాళ్లనే కోరుకున్న కాంట్రాక్టు సంస్థ



కుప్పం ఉపకాలువలో జరుగుతున్న లైనింగ్ పనులు

మదనపల్లె: వడ్డించే వాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఏముంది అన్న సామెత హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన చిత్తూరుజిల్లా కుప్పం ఉపకాలువ లైనింగ్ పనులకు అతికినట్టు సరిపోతుంది. ఈ లైనింగ్ పని చేపట్టింది అనకాపల్లె ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ, అందులోనూ సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కావడంతో ఇక చెప్పేదేముంటుంది. ఎవరేమనుకున్నా సరే మనోళ్లు, మనం చెప్పినట్టు వినే వాళ్లకు పనులు అప్పగిస్తే..ఇక అడ్డు అదుపు ఉండదనుకున్నారేమో..సరిగ్గా అదే జరిగింది. రూ.169 కోట్ల విలువైన పనులను చూసే బాధ్యతను కేవలం ఇద్దరంటే ఇద్దరే అధికారులకు అప్పగించేసిన ఉన్నతాధికారులు స్వామి భక్తిని చాటుకున్నారు. అంతటిలో ఆగలేదు..మీ పనులు మీ ఇష్టం అన్నట్టుగా నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేశారన్న విమర్శలు వినవస్తున్నాయి.

కేబీసీ లైనింగ్ పనులు ఇవి..

కుప్పం ఉపకాలువ(కేబీసీ)లో లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాక రెండు కాంట్రాక్టు సంస్థలు టెండర్లలో పాల్గొనగా అందులో రిత్విక్ ప్రాజెక్ట్ సంస్థ అదనంతో టెండర్ దాఖలు చేయగా ప్రభుత్వం దాన్నే ఖరారు చేసి పనులు అప్పగించింది. రెండు రీచ్‌లుగా నిర్ణయించిన ప్రభుత్వం రూ.169,80,935తో 90.393 కిలో మీటర్ల కాలువకు ఇరువైపులా సిమెంట్ లైనింగ్, అందులో 26.391 కిలోమీటర్లు షార్ట్ క్రీటింగ్ పనులు పూర్తి చేయాలి. మిగిలిన 64.002 కిలోమీటర్లు లైనింగ్ చేయాలి. ఈ పనులను వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయించాలన్నది లక్ష్యం. దీనికోసం పూర్తిస్థాయి సాంకేతిక అధికారులను నియమించి పర్యవేక్షణ, నాణ్యతా ప్రమాణాల పాటింపు, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి. అంటే ఇందుకు తగినంతమంది అధికారులను నియమించాలి. అయితే ఇక్కడ నిక్కచ్చిగా పనిచేసే అధికారులు అవసరం లేదనుకున్నారు. అంతే అయినవారికి పనులు అప్పగించేశారు.

డివిజన్ అధికారిని తప్పించేసి..

హంద్రీనీవా ప్రాజెక్టు సబ్ డివిజన్ కేంద్రం కుప్పంలో ఉంది. దీనికి సెల్వరాజ్ డీఈగా స్థానికంగా ఉండి పని చేస్తున్నారు. వాస్తవానికి కుప్పం ఉపకాలువ లైనింగ్ పనుల్లో ఈయన కీలకంగా పని చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టు సంస్థకు నచ్చలేదో లేక చెప్పినట్టు పని చేయరని అనుకున్నారో లేక ఉన్నతాధికారులు వద్దనుకున్నారో కాని కుప్పం లైనింగ్ పనుల్లో బాధ్యత వహించాల్సిన సెల్వరాజ్‌కు ఒక్కశాతం బాధ్యత లేకుండా పూర్తిగా తొలగించేసి పక్కన పెట్టారు. అయితే పూర్తిగా బాధ్యతలు అప్పగించకపోతే వివాదం రేగుతుందని అనుకున్నారేమో ఆయనకు చిత్తూరుజిల్లాలో పని కల్పించకుండా అన్నమయ్యజిల్లాలో జరుగుతున్న పుంగనూరు ఉపకాలువ పనుల్లో 12 కిలోమీటర్ల బాధ్యతలను అప్పగించి చేతులు దులుపుకున్నారు.

అంతా ఆ ఇద్దరికే

రూ.169 కోట్ల విలువ కలిగిన 90 కిలోమీటర్ల కాలువ పనులు..అందులో లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులు కీలకమైనవి. అయితే ఉన్నతాధికారుల కనుసన్నల్లో పనుల అప్పగింత వ్యవహారం సాగింది. పీబీసీ పనుల్లో ఐదుగురు డీఈఈలను నియమిస్తే..కుప్పం పనులకు అంతే మందిని నియమించాలి. అయితే ఇక్కడ నిబంధనలు పని చేయలేదు. డీఈ సెల్వరాజ్‌ను తప్పించాక..ఏరికోరి ఇద్దరికి బాధ్యతలు ఇచ్చారు. 90 కిలోమీటర్ల కాలువ పనులకు ఒకే ఒక్క డీఈఈగా గోవర్దన్‌ను, ఒకే ఒక్క ఈఈగా వెంకటేశ్వర్లును నియమించారు. ఎక్కువ మంది ఉండాల్సిన జేఈల సంఖ్య కేవలం నాలుగుకే పరిమితం చేశారు. మిగిలిన ఎవరికీ ఈ పనుల్లో భాగస్వామ్యం కాని, బాధ్యతలు కాని అప్పగించకుండా దూరంగా ఉంచేశారు. కుప్పం లైనింగ్ పనులకు ఒక ఈఈ, ఒక డీఈకే పూర్తి కాలువ బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులు మరి పుంగనూరు ఉపకాలువ విషయంలో అలా వ్యవహరించలేకపోడం వెనుక కారణాలేమిటన్నది చర్చనీయాంశమైంది. ఇక్కడ ఐదుగురు డీఈలకు బాధ్యతలు ఇస్తే..90 కిలోమీటర్లకు ఒకే డీఈకి ఎలా బాధ్యత ఇచ్చారో..ఒక్కరే ఇంత పని ఎలా నిర్వహిస్తారని ఉన్నతాధికారులు భావించారో అర్థంకాని వ్యవహారంగా మారింది. పీబీసీ పని నామినేషన్‌పై అప్పగిస్తే..కుప్పం పనిని టెండర్ ద్వారా రెండు రీచ్‌లుగా పనులు చేపట్టారు. ఇలా అయినా కనీసం ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలైనా ఉండాలి. అలా కూడా లేకుండా ఒక్క డీఈనే నియమించారు.

పనులపై అనుమానాలెన్నో

కుప్పం ఉప కాలువ పనులను 2015లో చేపట్టిన అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట సంస్థలోకి సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కాంట్రాక్టు సంస్థకు భాగస్వామ్యం కల్పించడంతో పనుల వ్యవహారం అస్తవ్యస్తంగా మారడమే కాకుండా రూ.122 కోట్లను అదనం పేరుతో దోపిడీ చేశారు. ఈ పరిస్థితుల్లో లైనింగ్ పనుల కాంట్రాక్టు రిత్విక్ సంస్థకు దక్కడంతో దీనిపై ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పనుల పర్యవేక్షణ కేవలం ఒక డీఈకే అప్పగించడం, వాటి వివరాల నమోదు, నాణ్యత పరిశీలన తదితర అంశాల్లో పారదర్శకంగా సాగడం లేదన్న వాదన వినిపిస్తోంది.

పది మంది జేఈలు

కుప్పం లైనింగ్ పనులకు ఒకే డీఈ, ఒకే ఈఈకి అప్పగించడం, కేవలం నలుగురు జేఈలే ఉన్నారన్న అంశంపై ప్రాజెక్టు ఎస్‌ఈ విఠల్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. పది మంది జేఈలు పని చేస్తున్నారని చెప్పారు. పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు.

5 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

రాజంపేట: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 5 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి గురువారం తాళ్లపాక, సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవోలునటేష్‌బాబు, ప్రశాంతి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వివరాలు: జూలై 05 ఉదయం 10.30 నుంచి 11గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైవుతాయి. ప్రతి రోజు ఉదయం 8గంటలకు , రాత్రి 7గంటలకు వాహనసేవలు జరుగనున్నాయి. 6న హంస వాహనం, 7న సింహవాహనం,8న హనుమంత వాహనం, 9న గరుడవాహనం, 10న సూర్యప్రభ, చంద్రప్రభవాహనం ,11న కల్యాణోత్సవం , 12 రథోత్సవం, 13న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం ఉంటాయి. 11న జరిగే కల్యాణోత్సవంలో గృహస్తులు (ఇద్దరు)రూ.500 చెల్లించి పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేయనున్నారు. జూలై 14న సాయంత్రం పుష్పయాగం జరుగుతంది.. టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు , దాస సాహిత్య ప్రాజెక్టుల ద్వారా ప్రతి రోజు ఆధ్యాత్మిక , భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా తాళ్లపాకలో జూలై 05 నుంచి 15వతేది వరకు శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మాదకద్రవాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ తదితరులు

రాయచోటి: డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరమని, దాని నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు తదితరులు రాయచోటి పట్టణం శివాలయం సర్కిల్ నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి భారతదేశమే కాదు యావత్ ప్రపంచాన్ని వణికిస్తోందన్నారు. దీనిని మొక్కగా ఉన్నప్పుడే తుంచివేసే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

- జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా చేయడం ద్వారా కేసులు పడి తద్వారా ఉద్యోగాలకు అర్హత సాధించక వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.మాదక ద్రవ్యాలు వినియోగించినా, అమ్మినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా నేరంగా పరిగణిస్తారన్నారు. దీనికి ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఎవరైనా వినియోగించి చనిపోయినా అమ్మినవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటమని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాదక ద్రవ్యాల దుర్వినియోగ నివారణపై అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీ, డీఈఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత జిల్లాగా మారుద్దాం: కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. మాదక ద్రవ్యాలను ఉపయోగించడం వల్ల సమాజానికి, మనకు, మన భవిష్యత్తు తరాల వారికి ఎంత ప్రమాదకరమో తెలియజేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలోని వివిధ శాఖలు, విద్యాసంస్థలు మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు చెప్పారు. మదనపల్లిలో ఆరువేల మందితో, రాజంపేటలో రెండువేల మందితో, ఇలా ప్రతి మండలాలలో 500 మందితో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

సమన్వయంతో యోగాంధ్రలో వరల్డ్ రికార్డు సాధించాం

రాయచోటి: జిల్లా పరిధిలోని అందరి సహకారం, సమన్వయం వల్లనే యోగాంధ్ర- 2025లో వరల్డ్ రికార్డు సాధించగలిగామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అభిప్రాయపడ్డారు. మే 21 నుండి జూన్ 21 వరకు జిల్లాలో నిర్వహించిన యోగాంధ్ర 2025 కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లెలో 5000 మందితో యోగా కార్యక్రమాన్ని ఎటువంటి ఎస్‌ఓపి లేకుండా నిర్వహించడంలో అధికారులందరూ కీలక పాత్ర పోషించారని అన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ కలెక్టర్ నిర్విరామ కృషి వల్లనే ప్రపంచ రికార్డు సాధించగలిగామని తెలిపారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడ్లుతున్నాయ్!

రహదారులు నెత్తురోడుతున్నాయి. మితిమీరిన వేగం.. నిర్లక్ష్యం.. నిద్ర లేమి.. వెరసి రోడ్డు ప్రమాదాలతో ఎరుపెక్కాయి. ఇటీవల జిల్లాలో జరిగిన వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంతో మంది ప్రాణాలు పోతున్న ఈ ఘటనలు ఆయా కుటుంబాలు తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. 2025 మే 26న గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో కారు లారీ ఢీకొన్న ప్రమాదాలల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

▲ గత వారంలో రాయచోటి నుంచి హైదరా బాదుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది.

- ఒకరి నిర్లక్ష్యం.. మరొకరికి ప్రాణ సంకటం
- మితిమీరిన వేగంతోనే రోడ్డు ప్రమాదాలు
- ఐదు నెలల్లో 172 మంది మృత్యువాత



గువ్వల చెరువు ఘాట్‌లో బోల్తా పడి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)



బుగ్గలేటి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఐదు నెలల వ్యవధిలో సమారు 307 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సుమారు 172 మంది మృత్యువాత పడగా 364 మంది క్షతగాత్రులయ్యారు. వేగ నియంత్రణ అమలు చేయకపోవడం, రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో పెట్టకపోవడంతోనే ప్రమాదాలు జరగుతున్నాయి. అధికారులు ఈ విషయాల్లో పున: సమీక్షించాల్సిన అవసరం ఉంది.

కారణాలెన్నో......

మితి మీరిన వేగం, మద్యం మత్తు, ఓవర్‌టేక్, అకస్మాత్తుగా వాహనం నిలపడం, ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం తదితర విషయాలు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులపై లారీలను ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. హోటళ్లు, డాబాలు, ఇతర దుకాణాల వద్ద హైవేకి అనుకొని ఆపుతున్నారు. ఈ క్రమంలో వెనుక వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించలేక వాటిని ఢీ కొంటున్నాయి. లారీలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా విశ్రాంతి స్థలాల్లో మాత్రమే నిలపాల్సి ఉన్న అక్కడ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో రోడ్లకు అనుకొని, చెట్ల కింద ఆపడం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి, ప్రైవేట్ బస్సులు అధికంగా రాత్రి వేళ తిరుగుతుంటాయి. ఈ క్రమంలో అందులో క్లీనర్‌గా పని చేసే వారు అరకొర డ్రైవింగ్‌తో అప్పుడప్పుడు వాహనాలు నడుపుతున్నారు. రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం, ముందు వెళుతున్న వాటిని వేగంగా అధిగమించే క్రమంలో పట్టుకోల్పోయి ప్రమాదాలకు కారణమవుతున్నారు.

తీర్మానం చేసినా.... ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 70 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బారికేడ్లు, రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీర్మానించారు. అది కార్యరూపం దాల్చినా కేవలం ఒకటి రెండు చోట్లకే పరిమితమైంది. అనంతరం అధికారులు అటు వైపు దృష్టి సారించిన దాఖల్లాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పదించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు గతంలోనే గుర్తించారు. వాహన డ్రైవర్ల నిద్ర మత్తు తొలగేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్లో ప్రమాదాలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. కాలక్రమంలో దీనికి బ్రేక్ పడింది.

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024	664	321	737
2025 మే వరకు	307	172	364

ఇలా చేస్తే...

జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చూడాలి. నిబంధనల మేరకు ముందు, వెనుక వాహనాలకు రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు అతికించాల్సిన అవసరం ఉంది. ఇవి రాత్రి వేళల్లో వాహనచోదకునికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. వేగ నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతి వేగంతో దూసుకెళుతున్న వాహనాలను నిఘా కెమెరాలతో గుర్తించి వెంటనే క్లెం వేయాలి. సంబంధిత వాహన యజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి. బ్లాక్ స్పాట్‌లలో సూచిక బోర్డులు, విద్యుద్దీపాలు, రహదారి మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి. రోడ్డు సేఫ్టీ కమిటీ నిర్ణయాలను అమలు చేయాలి. వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పున:ప్రారంభించాలి. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి.

రోడ్డు నిబంధలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం



రోడ్డు నియమ నిబంధలను ఉల్లంఘించే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌లతో తనిఖీలు చేపడుతున్నాం. మద్యం మత్తుల్లో వాహనాలను నడిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

–నిరంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్‌ఆర్ జిల్లా

ఉపాధి పనుల తనిఖీ

సిద్దవటం: మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న బెటాలియన్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఉపాధి ఏపీఓ నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లో ఉపాధి పనుల నిమిత్తం గతం వారం నుంచి కాలువ పనులు కొనసాగుతున్నాయన్నారు. కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు కూలీలు చేపట్టిన కాలువల ద్వారా చెరువులు, పెన్నా నదిలోకి వెళ్లే విధంగా పనులు చేపడుతున్నామన్నారు. దీని ప్రభావంతో రైతుల బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కుంటలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల వణ్య ప్రాణులకు తాగునీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. బెటాలియన్‌లో కాలువ పనులు రెండు నెలల పాటు కొనసాగుతాయన్నారు. ఉపాధి కూలీలు చేసిన పనులకు నగదు చెల్లింపులకు అధికారులకు నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు పుల్లయ్య, మేటిలు, కూలీలు పాల్గొన్నారు.

మదనపల్లెలో కాల్ మనీ కీచకులు

- కూటమి ప్రభుత్వంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాక్షి కథనం
- బాధితురాలు గౌరీకి మహిళా సంఘాల మద్దతు
- వడ్డీ రాకాసురులపై గళం విప్పిన బాధిత మహిళలు





మదనపల్లె రూరల్ : సరిగ్గా ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వంలో విజయవాడలో వెలుగు చూసిన కాల్ మనీ వ్యవహారం మళ్లీ పడగ విప్పుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కాల్ మనీ విష సంస్కృతి విస్తరిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై రోజు రోజుకు అఘాయిత్యాలు, అరాచకాలు, అకృత్యాలు పెరిగిపోతున్నాయి. నిన్నటికి నిన్న సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంలో అప్పు కట్టలేదని మహిళను చెట్టుకు కట్టేసి అమానుషంగా శిక్షించిన ఘటన మరువక ముందే.. మదనపల్లిలో వడ్డీ కోసం వ్యభిచారం చేయమని ఒత్తిడి తెచ్చేంతగా రాక్షసులు బరి తెగించారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విజయవాడ కేంద్రంగా కాల్ మనీ సెక్స్ రాకెట్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. సరిగ్గా అలాంటిదే మదనపల్లెలో జరుగుతున్న వ్యవహారంపై సాక్షి వెలుగులోకి తెచ్చిన కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బాధిత మహిళ గౌరీకి మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మద్దతుగా నిలిచారు. మదనపల్లె కాల్ మనీ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. కుప్పంలో అప్పు తీర్చలేదని ఓ మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన ఘటనలో తక్షణమే స్పందించిన సీఎం చంద్రబాబు, మదనపల్లెలో రజక సామాజిక వర్గానికి చెందిన చెందిన బీసీ మహిళ, మరికొందరు బడుగు జీవులపై జరుగుతున్న అన్యాయాలపై కనీస స్పందన లేకపోవడంపై విమర్శలను సంధిస్తున్నారు.

పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి ముక్కు పిండి మరీ వసూలు చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడే ముఠాలు మదనపల్లెలో అధికమయ్యాయి. డైలీ, వీక్లీ, మంత్లీ.. పేరుతో వందకు పది రూపాయల నుంచి 45 రూపాయల వరకు, ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ష్యూరిటీగా ఉంచుకొని ఎడాపెడా రుణాలను ఇచ్చేస్తున్నారు. అప్పు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించకపోయినా, కాస్త ఆలస్యం చేసినా ఇళ్ల వద్దకు వెళ్లి వారిని దుర్భాషలాడటం, లైంగికంగా వేధింపులకు గురి చేయడం సర్వసాధారణమైపోయింది. కాల్ మనీ పేరిట మహిళలను వేధించిన వారికి ఉన్న పలుకుబడులు బాధితులకు న్యాయం జరగనీయకుండా చేస్తున్నాయి. మదనపల్లెలో నీరుగట్టువారిపల్లె, రామారావు కాలనీ, అనప గుట్ట, కురవంక, వీవర్స్ కాలనీ, బసినికొండ, ప్రశాంత్ నగర్ తదితర ప్రాంతాల్లో ముఖ్యంగా చేనేత కార్మికులు నివసించే చోట వడ్డీ వ్యాపారం విస్తృతంగా కొనసాగుతోంది. వడ్డీ రాక్షసుల ఆగడాలపై బాధిత మహిళలు బుధవారం సాక్షితో మాట్లాడారు. తమ పేర్లు వెల్లడించవద్దని కోరుతూ తాము ఎదుర్కొన్న వేధింపులను ఏకరువు పెట్టారు. అప్పులు తీర్చమని తమపై ఒత్తిడి తెస్తూ వడ్డీ వ్యాపారులు మానసికంగా శారీరకంగా తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. వాటిని భరించలేక పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టేందుకు ప్రయత్నిస్తే, మధ్యవర్తుల ద్వారా రాజీమార్గాలను ఎంచుకొని, తరువాత తమ వద్ద నుంచి తీసుకున్న ఖాళీ బ్యాంకు చెక్కులతో కోర్టులో కేసులు వేసి వేధిస్తున్నారని తెలిపారు. రుణాల చెల్లింపు కోసం తమ వద్ద ఆస్తులను రాయించుకుని వేధిస్తున్నారన్నారు. వీరి బాధల నుంచి బయటపడేందుకు జిల్లా స్థాయి పోలీస్ అధికారులను, తాము సంప్రదించాలని భావిస్తున్న విషయాన్ని ముందే పసిగట్టి, తమకంటే ముందే జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్లి తమపై ఫిర్యాదు చేసి సోషల్ మీడియాలో తమను దోషులుగా చిత్రీకరించి, వారి వేధింపులను ఆగడాలను కనుమరుగయ్యేలా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. స్థానిక పోలీసులకు వారి ఆగడాలపై ఫిర్యాదులు చేస్తే పట్టించుకోకుండా వడ్డీ రాక్షసులకే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలున్నాయి. అప్పు తీసుకున్న పాపానికి వడ్డీలకు వడ్డీ చెల్లించినా, తమకు రుణ బాధల నుంచి విముక్తి కలగలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వడ్డీ వ్యాపారుల కోరల నుంచి తమను రక్షించాలని బాధితులు కోరుతున్నారు. మనిషి ఆర్థిక అవసరాలను అవకాశంగా తీసుకొని వ్యాపారులు దోచుకుంటున్నా, అధిక వడ్డీలు, అక్రమ వసూళ్ల పేరుతో అమాయకులను బలిచేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని, వసూళ్ల పేరుతో మహిళలను బెదిరించి, వేధిస్తే క్రిమినల్ కేసులు పెడతామని.. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారే టార్గెట్‌గా జరిగే వడ్డీ వ్యాపారాలను కూటమి సర్కార్ సీరియస్‌గా తీసుకుంటుందని హెచ్చరించిన హోం మంత్రి అనిత... మదనపల్లె ఘటనపై చర్యలు తీసుకోకవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

ఏటీఎం కార్డు తస్కరించి రూ.25 వేలు డ్రా



బాధితుడు నరసింహులు

నందలూరు : మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు తస్కరించి రూ.25 వేలు డ్రా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు విశ్రాంత ఉపాధ్యాయుడు సానిపాటి నరసింహులు వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఏటీఎం కార్డును చోరీ చేసి ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.25 వేలు డ్రా చేసుకున్నాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు.

నాటు సారా కేసులో ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం బుడిగుంటపల్లి పంచాయతీ, దొరెట్టిపల్లి క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ తులసీ మాట్లాడుతూ నాటు సారా, అక్రమ మద్యం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ప్రాధాన్యం పెంచాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో స్పోర్ట్స్ రంగంలో తలెత్తిన ఫేక్ సర్టిఫికెట్స్ సమస్యలపై దృష్టి సారించి వాటికి అడ్డుకట్ట వేసి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ప్రాధాన్యత పెంచాలని ఏపీపీఈటీస్ అండ్ ఎస్‌ఏపీఈ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, సభ్యులు కోరారు. ఈ విషయమై రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోట్‌లోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో కలసి వినతి పత్రం అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల్లో రాజకీయాలొద్దు

వేంపల్లె : గండి వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనుల్లో రాజకీయాలొద్దని, ఆలయం పూర్తికి ఇంకా ఏడాది సమయం పడుతుందని జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని హడావిడిగా రాబోయే శ్రావణమాసానికి ఆలయాన్ని తెరిపించే పనులు చేపట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దశరథ, జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలుకు గురువారం చివరి రోజు కావడంతో కేవలం మజ్దూర్ యూనియన్ వర్గం మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈమేరకు సంబంధిత అధికారి నిర్ధారించాల్సి ఉంది. మజ్దూర్ యూనియన్ తరుపున రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశ్వరరెడ్డి, ఆపరేటింగ్ కమిటీ సభ్యునిగా లక్ష్మినారాయణ, చిన్నబాబు, ఎలక్ట్రికల్, కమర్షియల్ ఇంజనీరింగ్ ఎస్అండ్‌టీ కమిటీ సభ్యులుగా రాజేష్ కుమార్, అనిల్‌కుమార్, గీత, మస్తాన్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

బూత్ కమిటీ సమావేశంలో తెలుగు తమ్ముళ్ల వాగ్వాదం



షాదీఖానాలో టీడీపీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు : నందలూరు షాదీఖానాలో గురువారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు వర్గాలుగా విడిపోయి వాగ్వాదం చేసుకున్నారు. కుటుంబ సాధికారత సమితి (కేఎస్ఎస్) కమిటీలు వేసేటప్పుడు తమకు ఎందుకు చెప్పలేదని కొంత మంది టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన నాయకులందరికీ చెప్పాల్సిన అవసరం లేదని కొంత మంది నాయకులు తెలపడంతో వాగ్వాదం మొదలైంది. నందలూరు మండల పరిశీలకుడు ఆరే సుధాకర్‌నాయుడు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జిని ప్రకటించకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

మున్సిపల్ వైస్ చైర్మన్, మహిళా కౌన్సిలర్, మరో 16 మంది పై కేసు నమోదు

రాయచోటి : రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథరామిరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ పి.విజయమ్మతోపాటు మరో 16 మందిపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరిగేషన్ రిటైర్డ్ డీఈ మండెం ఆదినారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బి.వి. చలపతి తెలిపారు. రాయచోటి పట్టణ పరిధిలోని 553 సర్వే నంబరులో భూ తగదా విషయంపై దశరథరామిరెడ్డి తన అనుచరులతో కలిసి మే 22వ తేదీన దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదు అందిందన్నారు. అప్పటి నుంచి రాజీకి ప్రయత్నించగా కుదరకపోతే కేసు నమోదు చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకే తమపైన కేసు నమోదు చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి మీడియాకు తెలిపారు.

రైతుపై ఆర్టీసీ కార్గో సిబ్బంది దాడి



గాయపడిన బాబు రెడ్డి

రాయచోటి : మామిడి పండ్ల ప్యాకెట్లను పార్సిల్ చేయడానికి వెళ్లిన రైతుపై ఆర్టీసీ కార్గో సిబ్బంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. రాయచోటి పట్టణం కొత్తపేటలో నివాసం ఉంటున్న రైతు బాబు రెడ్డి (30) తోటలో పండించిన మామిడి కాయలను బంధువులకు పంపించేందుకు రెండు ప్యాకెట్లను తీసుకొని రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో గల పార్శిల్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లారు. రైతు తెచ్చిన ప్యాకెట్లు చిన్నవిగా ఉండటంతో రెండు కలిపి ఒకటిగా పంపుకోవచ్చని అక్కడున్న ఆర్టీసీ సిబ్బంది బాబు రెడ్డికి సూచించారు. రెండిటిని కలిపి ఒకే ప్యాకేజీలో పార్సల్ చేయాలని కొరియర్ సిబ్బందికి సూచించారు. పార్సెల్ సర్వీస్ లో పనిచేస్తున్న అంజి నాయక్, సాయి అనే యువకులు ఆ మామిడి పండ్లు రెండు పార్సెల్ ఒకటిగా పంపించడం కుదరదని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు పార్సెల్ పంపేందుకు వచ్చిన రైతు పై దాడికి దిగారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. పార్సెల్ సర్వీస్ లో పనిచేసే అంజి నాయక్, సాయి లు ఇద్దరు కలిసి వేయింగ్ మిషన్ తో బాబు రెడ్డి తలపై బలంగా కొట్టడంతో పాటు తీవ్రంగా గాయపరిచారు. దాడిలో బాబు రెడ్డి తీవ్రంగా గాయపడమే కాకుండా అతని జేబులో ఉన్న 50 వేలు నగదు కూడా గల్లంతయిందని బాధితుడు వాపోయాడు. తీవ్రంగా గాయపడిన బాబు రెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మామిడి పండ్లు పార్సల్ పంపేందుకు వెళ్లిన రైతు బాబురెడ్డిపై దాడి చేసిన ఆర్టీసీ కార్గో సిబ్బందిని కఠినంగా శిక్షించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగా రెడ్డి డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణ శివారు ప్రాంతంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొద్దుటూరు ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ప్రొద్దుటూరు ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. దాడిలో సీకే దిన్నె మండలంలోని మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బి.రామాంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను స్థానికంగా ఉన్న పలు కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

బైకులు ఎదురెదురుగా ఢీకొని యువకుడి దుర్మరణం



బైకులు ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం చెందిన హరీష్



తీవ్రంగా గాయపడిన స్వామినాథ్

- మృతుడు పత్రావారిపల్లె వాసి
- మరో యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : బైకులు ఎదురెదురుగా ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పత్రవారి పల్లెకు చెందిన కృష్ణమూర్తి, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు హరీష్ (24), తన బంధువు, వృత్తిరీత్యా డ్రైవర్ అయిన బాబు మోహన్(25)తో కలసి స్కూటీలో వ్యక్తిగత పనులపై పుంగనూరుకు వెళ్లారు. అక్కడి నుంచి బాబు మోహన్ టాటా ఏస్ వాహనం తీసుకుని బయలుదేరాడు. హరీష్ స్కూటీ వాహనంలో స్వగ్రామానికి బయలుదేరి వస్తుండగా, మదనపల్లె సమీపంలోని వలసపల్లి పంచాయతీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద, పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన బైక్ మెకానిక్ స్వామినాథ్ (28) మద్యం మత్తులో, మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్లి స్కూటీని ఢీకొన్నాడు. ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న హరీష్ ఎగిరి దూరంగా పడటంతో తలకు తీవ్ర గాయమై, చెవులు, ముక్కులలో అధిక రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి వెళ్లాడు. వెనుకనే టాటా ఏస్ వాహనంలో వస్తున్న బాబు మోహన్ గుర్తించి అదే వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన ఆసుపత్రి అత్యవసర విభాగం వైద్యులు హరీష్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వామినాథ్ కూడా తీవ్రంగా గాయపడటంతో చికిత్స అందించారు. హరీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గొడవ పడొద్దన్నందుకు కత్తితో దాడి



దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేఖ

మదనపల్లె రూరల్ : తోడికోడళ్ల మధ్య సమస్య ఏర్పడి గొడవ జరిగితే, పుట్టింటి వారు వచ్చి గొడవ ఎందుకని ప్రశ్నిస్తే కత్తితో దాడి చేసిన ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. సత్యసాయి జిల్లా కదిరి పటణం రాజీవ్ నగర్‌కు చెందిన అమృత ను, మదనపల్లె పట్టణం కుమారపురంలో ఉన్న మున్సిపల్ ఉద్యోగి శ్రీనివాసులుకు ఇచ్చి 15 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. శ్రీనివాసులు తన ఇద్దరు అన్నదమ్ములైన శంకర, గోవిందుతో కలిసి ఒకే కాంపౌండ్‌లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం శ్రీనివాసులు ఇంటి వద్ద లేని సమయంలో అమృతకు తోడికోడళ్లయిన మంగమ్మ, అనసూయమ్మతో వివాదం ఏర్పడి, ఘర్షణ చోటు చేసుకోగా, వారందరు కుటుంబ సభ్యులతో కలిసి అమృతపై దాడి చేసి కొట్టారు. ఈ విషయం ఆమె పుట్టింటి వారికి చెప్పడంతో, వారు పది మందితో కలిసి కుమారపురానికి వచ్చారు. గొడవెందుకని మాట్లాడే ప్రయత్నం చేస్తుండగానే, అనసూయమ్మ కుమార్తె భారతి ఇంట్లో ఉన్న సత్తూర్ (కత్తి)తో అమృత ఆడపడుచు అయిన శివకుమార్ భార్య సురేఖ (30)పై దాడి చేసింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. మిగతా వారైనా శంకర, గోవిందు, భువనేశ్వరి, మంగమ్మ అనసూయమ్మలు కదిరి నుంచి వచ్చిన అమృత బంధువులపై దాడి చేశారు. దాడిలో కళ్యాణ్ కుమార్ (30), రాజ్యలక్ష్మి(27) గాయపడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

భర్త ఇంటి ముందు బైఠాయింపు



భర్త ఇంటి ముందు బైఠాయించిన బాధితురాలు

నందలూరు : తన భర్తతో తనను కలిపి న్యాయం చేయాలంటూ ఓ మహిళ అత్తగారి ఇంటి ముందు తండ్రితో కలిసి బైఠాయించిన సంఘటన నందలూరులో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని అరవపల్లికి చెందిన హనుమంతు మురళి, శ్రీలక్ష్మీ కుమారుడు దేవేంద్రప్రసాద్‌కు వేంపల్లెకు చెందిన యనమల వెంకటనారాయణ, లక్ష్మీదేవిల కుమార్తె శారదతో 2014లో వివాహమైంది. నాలుగు సంవత్సరాల పాటు సంసారం సజావుగా సాగింది. 2018లో అత్తా కోడళ్ల మధ్య మనస్పర్థలు రావడంతో తన పుట్టింటికి శారద వెళ్లింది. ఇదే అదునుగా భావించిన ప్రసాద్ కోర్టును ఆశ్రయించి తన భార్య ఆరోగ్యం సరిగా లేదంటూ కోర్టును పెడదోవ పట్టించి 2021లో విడాకులు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న శారద పోలీసులకు ఫిర్యాదు చేసి రాజంపేట కోర్టును ఆశ్రయించడంతో జులై 2024లో విడాకులను రద్దు చేసింది. అప్పటి నుంచి తన భర్తను కలవాలని ప్రయత్నిస్తుంటే ఈ రోజు, రేపు, మాపు అంటూ సంవత్సరం నుంచి కాలం గడిపి తనను అత్తగారింటికి రానివ్వలేదని వాపోయారు. తిరిగి తాము గురువారం పోలీసులను ఆశ్రయించామన్నారు. వారు తన భర్తకు ఫోన్ చేయగా వెంటనే సెల్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఇంటికి తాళాలు వేసుకుని పరారయ్యారని తెలిపారు. పెద్దలు, పోలీసులు తనను తన భర్తతో కలిపి తన సంసారాన్ని నిలబెట్టాలని బాధితురాలు వేడుకుంటోంది.

కార్మిక సంఘాల సమ్మె నోటీసు



గోపినాథ్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : జూలై 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను కార్మిక సంఘాలు నిర్వహిస్తుండగా వారి పిలుపు మేరకు గురువారం మంగంపేట ఏపీఎండీసీ సీపీఓ గోపినాథ్‌కు కార్మిక సంఘం నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఏపీఎండీసీ అవుట్ సోర్సింగ్ ట్రైనీ పోరాట యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్, కో-కన్వీనర్ అరుణపతి, ధనలక్ష్మీ, గుడిపాటి హరిబాబు, రాజారెడ్డి, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ నాణ్యతకు హామీ భారతి సిమెంట్



మాట్లాడుతున్న భారతి సిమెంట్ కంపెనీ డీజీఎం ఓబుళరెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : నాణ్యతా ప్రమాణాలలో మేటి భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ కంపెనీ డీజీఎం ఓబుళ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని స్థానిక మైరా రెస్టారెంట్‌లో కాంట్రాక్టర్లకు భారతి సిమెంట్ అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. ఇతర కంపెనీ సిమెంట్‌తో పోలిస్తే తక్కువ సమయంలోనే భారతి సిమెంట్ సెట్ అవుతుందన్నారు. వేగంగా కట్టే బిల్డింగ్‌లకు అత్యుత్తమ పరిణామాలను, నాణ్యతను భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ రెండు గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. చాలా దృఢత్వాన్ని కలిగి ఉన్న భారతి సిమెంట్‌తో కట్టడాలు త్వరగా పూర్తవుతాయన్నారు. మార్కెట్‌లో చాలామంది బిల్డర్లు, కాంట్రాక్టర్లు భారతి సిమెంట్ వాడుతున్నారన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, నాగేంద్రబాబు, డీలర్ అశోక్, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. కాశినాయన ఎస్ఐ యోగేంద్ర తెలిపిన వివరాల మేరకు సుమారు 20 రోజుల క్రితం ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసుకుని సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశామని ఎస్ఐ తెలిపారు.

భారీ స్కోరు దిశగా కడప జట్టు



201 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్ రెడ్డి



139 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ గురు విఘ్నేష్



4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ వరుణ్ సాయి నాయుడు



4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి



103 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ కేహెచ్ వీరారెడ్డి

డబుల్ సెంచరీ చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో కడప జట్టు భారీ స్కోరు దిశగా ఆడుతోంది. తొలి రోజు గురువారం వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీల్ రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 291 బంతుల్లో 23 ఫోర్లతో 201 పరుగులు చేశాడు. గురు విఘ్నేష్ 147 బంతుల్లో 15 ఫోర్లు, 6 సిక్సర్లతో 139 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మల్లికార్జున 2 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

అదే విధంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 50.4 ఓవర్లకు 212 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మన్విత్‌రెడ్డి 48, సయ్యద్ షాహుల్ హుస్సేన్ 32 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు, వరుణ్ సాయి నాయుడు 4 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 34 ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 194 పరుగులు చేసింది. ఆ జట్టులోని కేహెచ్ వీరారెడ్డి, 107 బంతుల్లో 19 ఫోర్లు, 2 సిక్సర్లతో 103 పరుగులు చేయగా జయంత్ కృష్ణ 78 పరుగులు చేశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

భవనం మీద నుంచి కింద పడి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన ఖాజావలీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : అన్నమయ్య జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాయపాటి ఖాజావలీ (50) ప్రమాదవశాత్తు భవనం మీద నుంచి కిందపడి మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు గురువారం సాయంత్రం కడప అశోక్ నగర్ లోని తమ ఇంటి సిమెంటు రేకులపై వర్షం నీళ్లు పడకుండా ప్లాస్టిక్ పట్ట కప్పేందుకు తన భార్యతో కలిసి పైకి ఎక్కారు. ఇద్దరూ పట్ట కప్పుతుండగా ఖాజావలీ నిలుచున్న ప్రదేశంలో ప్రమాదవశాత్తు సిమెంటు రేకులు విరగడంతో పైనుంచి కింద పడ్డాడు. తల వెనుక భాగంలో రక్త గాయమై ముక్కు నుంచి రక్తం కారుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతని భార్య బంధువులతో కలిసి నగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఇతనికి భార్య మాబున్నీ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.